సాక్షి
నిజామాబాద్

శుక్రవారం । 21 । జూలై । 2023



డుమ్మా చాన్స్ లేదిక..!
ఉపాధ్యాయులు ఇష్టారాజ్యంగా స్కూళ్లకు డుమ్మా కొట్టే అవకాశం లేకుండా హాజరును ఆన్‌లైన్ చేయనున్నారు.

- 8లో ▸



అప్రమత్తత అవసరం
జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.

- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
26.2 /22.7

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం నుంచి వర్షం కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం నుంచి మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ప్రదేశ్ ఎన్నికల కమిటీలోకి మహేశ్‌కుమార్ గౌడ్



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రానున్న శాసనసభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఏఐసీసీ నాయకత్వం ప్రదేశ్ ఎన్నికల కమిటీని నియమించింది. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చైర్మన్‌గా వ్యవహరించనున్న ఈ కమిటీలో మొత్తం 26 మంది సభ్యులను, ముగ్గురు ఎక్స్ అఫీషియో సభ్యులను నియమించారు. ఈ మేరకు గురువారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే నిజామాబాద్‌కు చెందిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ ఈ కమిటీలో ఉన్నారు. ఎన్నికలకు సంబంధించి ఈ కమిటీకి అత్యున్నత పాత్ర పోషించనుంది.

నేడు జిల్లాకు యూఎస్ కాన్సులేట్ బృందం

డొంకేశ్వర్(ఆర్మూర్): అమెరికన్ కాన్సులేట్ అధికారుల బృందం శుక్రవారం జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయానికి రానుంది. ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని కార్యాలయానికి చేరుకుని వ్యవసాయాధికారులతో సమావేశమవుతారు. అనంతరం రైతులతో మాట్లాడేందుకు క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లే అవకాశముంది. వివిధ అంశాలపై రైతులతో సర్వే చేయడానికి యూఎస్ కాన్సులేట్ అధికారులు వస్తున్నట్లు తెలిసింది.

పసుపు ధర @ 13,555



సుభాష్‌నగర్: నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో గురువారం పసుపు ధర రికార్డు స్థాయిలో పలికింది. క్వింటాలుకు రూ. 13,555 ధర వచ్చింది. అంక్సాపూర్‌కు చెందిన రైతు దామోదర్‌రెడ్డికి చెందిన సుమారు 90 క్వింటాళ్ల పసుపునకు ఈ ధర పలికింది. దీంతోపాటు మరో 150 క్వింటాళ్ల పంటకు రూ. 13వేల వరకు ధర వచ్చింది. పసుపు ధర సగటున రూ. 9వేల పైచిలుకు పలకడం గమనార్హం. మండకు సైతం రూ. 10 వేల వరకు పలుకుతోంది. పచ్చ బంగారం ధర పైపైకి ఎగబాకుతుండడంతో పసుపు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో మన పంటకు డిమాండ్ పెరుగుతుండటమే ధర ఎగబాకడానికి కారణమని వ్యాపారులు పేర్కొంటున్నారు. రానున్న రోజుల్లో పసుపు ధర మరింత పెరిగే ఆస్కారముందని వారు పేర్కొన్నారు. గడిచిన ఐదారేళ్లలో క్వింటాలుకు ఇంత మొత్తంలో ధర పలకడం ఇదే మొదటిసారి.

తాత్కాలిక కల్వర్టు నిర్మాణం పూర్తి



డిచ్‌పల్లి: భారీవర్షాల ధాటికి బుధవారం మాధవనగర్ రైల్వే గేటు వద్ద కొట్టుకుపోయిన కల్వర్టును గురువారం తాత్కాలికంగా నిర్మించారు. ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ రాజేశ్వర్‌రెడ్డి, ఈఈ సురేశ్, డీఈ ప్రవీణ్ యుద్ధప్రాతిపదికన పైపులు, మట్టివేసి కల్వర్టు నిర్మాణ పనులు పూర్తి చేయించారు. గురువారం సాయంత్రం నుంచి కేవలం బైక్‌ల రాకపోకలకు మాత్రమే అనుమతి ఇచ్చారు. కార్లు, లారీలు, భారీ వాహనాలు ఈ రోడ్డులో వెళ్లవద్దని, బైపాస్ మీదుగా వెళ్లాలని అధికారులు సూచించారు.

ఇందూరు నయాగారా

చుట్టూ దట్టమైన అడవి.. మధ్యలో చెరువు.. 40 అడుగుల ఎత్తు నుంచి నీరు జాలువారుతూ జలపాతాన్ని తలపిస్తోంది నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం సిర్నాపల్లి శివారులోని సిర్నాపల్లి జానకీబాయి చెరువు. నాలుగు రోజులు కురిసిన వర్షాలతో చెరువు నిండి గురువారం నుంచి అలుగు పారుతోంది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



నమోదైన వర్షపాతం వివరాలు..

మండలాలు	వర్షపాతం	మండలాలు	వర్షపాతం
	మిల్లీమీటర్లలో..	నిజామాబాద్ నార్త్	29.3
నవీపేట్	21.0	ధర్పల్లి	76.4
డిచ్‌పల్లి	62.9	మోర్తాడ్	21.2
ఇందల్వాయి	105.6	ఏర్గట్ల	17.3
మాక్లూర్	27.7	ఎడపల్లి	20.9
రెంజల్	16.0	మోస్రా	20.2
సిరికొండ	57.3	జక్రాన్‌పల్లి	33.1
ఆలూరు	22.8	మోపాల్	27.6
చందూరు	23.7	భీమ్‌గల్	24.9
వేల్పూరు	17.9	కమ్మర్‌పల్లి	23.7
నిజామాబాద్‌రూరల్	33.2	నిజామాబాద్ నార్త్	16.3

ఎస్సారెస్పీలోకి పెరిగిన వరద

- 59,165 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 38 టీఎంసీలకు చేరిన నీటి నిల్వ

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి గురువారం వరద నీరు పెరిగింది. ఎగువ ప్రాంతం నుంచి 59,615 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. ప్రతి గంటకు 0.10 అడుగుల నీటిమట్టం పెరుగుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 38 టీఎంసీలకు చేరుకుంది. ఒక్క రోజు వ్యవధిలో 4 టీఎంసీలు వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువ ద్వారా 50 క్యూసెక్కులు, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 360 క్యూసెక్కులు, గుత్ప లిఫ్ట్ ద్వారా 270 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 359 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 152 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు(90 టీఎంసీలు) కాగా గురువారం రాత్రికి ప్రాజెక్టులో 1074అడుగుల(38 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు.



పోతంగల్ మండలం కొల్లూర్ వాగు సమీపంలో కొట్టుకుపోయిన రోడ్డు

చెరువులకు జలకళ



అలుగుపారుతున్న బర్ధిపూర్ కోనం చెరువు

నిజామాబాద్ నాగారం: జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో కుంటలు, వాగులు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. ఇప్పటికే 104 చెరువులు పూర్తిగా నిండాయి. 63 చెరువుల్లో 25 శాతం మేర నీరు నిండగా, మిగతా చెరువులు 50 నుంచి 75 శాతానికి పైగా నిండాయి. దీంతో పంటలకు ఢోకా లేకుండా పోయింది.

జిల్లాలో 1,087 చెరువులు..

జిల్లాలో మొత్తం 1,087 చెరువుల్లో 104 చెరువులు నిండి పొంగిపొర్లుతున్నాయి. 63 చెరువులు 25 శాతం లోపు, 196 చెరువులు 25 శాతం నుంచి 50 శాతం లోపు, 454 చెరువులు 50 శాతం నుంచి 75 శాతం వరకు, 202 చెరువులు 75 శాతం నుంచి 100 శాతం మేర నిండాయి.

వివరాలిలా..

నియోజకవర్గం	చెరువులు	25%లోపు	50%లోపు	75%లోపు	పొంగినవి
నిజామాబాద్	324	58	43	40	25
బోధన్	182	0	64	43	31
ఆర్మూర్	198	0	84	67	22
బాల్కొండ	292	5	168	52	03
బాన్సువాడ	91	0	22	24	23

విస్తారంగా వర్షాలు

- అలుగు పారుతున్న చెరువులు
- భారీ వర్షాలకు పలు మండలాల్లో కూలిన ఇళ్లు
- కనువిందు చేస్తున్న సిర్నాపల్లి జానకీబాయి చెరువు అలుగు అందాలు
- పొలాల్లోకి చేరుతున్న వరద నీరు..
- మరో రెండ్రోజులు భారీ వర్షసూచన

సుభాష్‌నగర్ : జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటికే 15 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. గడిచిన 24 గంటల్లో అత్యధికంగా ఇందల్వాయి మండలంలో 10.6 సెంటీమీటర్ల వర్షం కురిసింది. సగటున 24.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్ని పెద్ద చెరువు, బర్ధిపూర్ చెరువుతోపాటు 104 చెరువులు అలుగులు పారుతున్నాయి. ఇందల్వాయి మండలంలోని సిర్నాపల్లిలోని జానకీబాయి చెరువు అలుగు అందాలు ప్రజలను కనువిందు చేస్తున్నాయి. భారీ వర్షాలకు ఒన్నాజీపేట్, యానంపల్లి తండా, తదితర గ్రామాల్లో శిథిలావస్థకు చేరిన ఇళ్లు కూలిపోయాయి. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఎడతెరపి లేకుండా వానలు కురుస్తుండటంతో పంట పొలాల్లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. వరద దాటికి పలుచోట్ల రోడ్లు తెగిపోవడంతో అధికారులు మరమ్మతులు చేపట్టారు.

15 మండలాల్లో అత్యధిక వర్షపాతం..

గతవారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఈ సీజన్‌లో 15 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. మూడ్రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు 15 మండలాలు మినహా మిగతా చోట్ల లోటు వర్షపాతం నుంచి సాధారణ వర్షపాతానికి చేరుకున్నాయి. కేవలం నిజామాబాద్ సౌత్ మండలం మాత్రమే ఇంకా లోటు వర్షపాతం నమోదైంది. గడిచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా 819 మిల్లీమీటర్ల వర్షం కురిసిందని అధికారులు పేర్కొన్నారు. రాగల రెండ్రోజులు కూడా జిల్లాకు భారీ వర్ష సూచన ఉంది.



కందకుర్తి సమీపంలోని అంతర్రాష్ట్ర వంతెన వద్ద గోదావరి నదిలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు

గోదావరి పరవళ్లు

రెంజల్(బోధన్) : గోదావరి నది పరవళ్లు తొక్కుతోంది. ఎగువన ఉన్న మహారాష్ట్రతో పాటు జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గోదావరి పరుగులు పెడుతుంది. రోజు రోజుకు నదిలో నీటి మట్టం క్రమంగా పెరుగుతుంది. స్థానిక వాగులు, వంకలు పొంగిపోర్లుతున్నాయి. గోదావరితో పాటు మంజీరా, హరిద్ర నదుల నుంచి వరద నీరు వచ్చి కందకుర్తి త్రివేణి సంగమం వద్ద కలవడంతో ఉధృతంగా ప్రవహిస్తూ దిగువన గల ఎస్సారెస్పీలోకి చేరుకుంటుంది. నదిలోని పురాతన శివాలయం చుట్టూ వరద నీరు వచ్చి చేరింది.

ఐటీ రంగాన్ని విస్తరిస్తాం

- ఐటీ హబ్‌ను పరిశీలించిన అర్బన్ ఎమ్మెల్యే
- నేడు జాబ్ మేళాకు హాజరుకావాలి

నిజామాబాద్ నాగారం : ద్వితీయ శ్రేణి నగరాలకు ఐటీ రంగాన్ని విస్తరించి స్థానిక యువతకి ఉద్యోగాలు కల్పించే దిశగా ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా తెలిపారు. గురువారం నగరంలోని ఐటీహబ్‌ను టాస్క్ సీఈవో శ్రీకాంత్ సింహాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో బైపాస్ రోడ్ వద్ద మూడంతస్తులు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, విశాలమైన ప్రాంగణంలో నిర్మించిన ఐటీ హబ్ ప్రారంభానికి సిద్ధంగా ఉందన్నారు.



ఐటీహబ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బిగాల

జాబ్‌మేళాకు ఏర్పాట్లు

జిల్లాలో ఉన్న నిరుద్యోగులు డిగ్రీ, ఆపైన చదివిన విద్యార్థులు శుక్రవారం నగర శివారులోని భూంరెడ్డి కన్వెన్షన్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించే జాబ్‌మేళాకు హాజరుకావాలన్నారు. భూమారెడ్డి కన్వెన్షన్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇదేమి పారిశుధ్యం..

నిజామాబాద్ నాగారం : నగరంలోని అర్సపల్లి జోన్ పరిధిలోని మాలపల్లిలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉండడంపై కమిషనర్ మంద మకరందు అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం ఉదయం అర్సపల్లి జోన్ పరిధిలోని పలు డివిజన్లు, కాలనీల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శానిటేషన్ అధికారులు, సిబ్బంది పనితీరు సరిగ్గా లేకపోవడంతో పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైందని అసహనం వ్యక్తం చేశారు. మురికినీరు సక్రమంగా ప్రవహించడం లేదన్నారు. సానిటేషన్ పక్కాగా చేపట్టాలన్నారు.



మాలపల్లిలో సానిటేషన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ మంద మకరందు

అలాగే పోలింగ్ కేంద్రాలను కూడా తనిఖీ చేశారు. వివరాలను సరిగ్గా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంహెచ్‌వో సాజిద్ అలీ, ఆర్‌వో నరేందర్ ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి ముత్యాల సునీల్‌రెడ్డి

- ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడి సమక్షంలో చేరిక
- ఇప్పటికే బాల్కొండ కాంగ్రెస్ టికెట్ రేసులో పలువురు



ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న సునీల్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: శాసనసభ సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ జిల్లాలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. తాజాగా గురువారం ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సునీల్‌రెడ్డి పార్టీలో చేరారు. సునీల్‌రెడ్డి చేరిక విషయంలో పీసీసీ కోశాధికారి, మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి ప్రధానపాత్ర పోషించడం గమనార్హం. సునీల్‌రెడ్డి గత ఎన్నికల్లో కాంగ్రెస్ టిక్కెట్ కోసం చివరి వరకు ప్రయత్నాలు చేశారు. అవకాశం దక్కకపోవడంతో బీఎస్పీ నుంచి పోటీచేసి రెండోస్థానంలో నిలవడం గమనార్హం. ఇదిలా ఉండగా కొన్ని నెలల క్రితం వరకు జిల్లా కాంగ్రెస్‌లో అంత ఊపు కనపడలేదు. రేవంత్‌రెడ్డి పాదయాత్ర, రాహుల్ జోడోయాత్ర తర్వాత పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం పెరిగింది. కర్ణాటక ఫలితాలతో ఒక్కసారిగా ఉత్సాహం రెట్టింపయ్యింది. ఈ క్రమంలో పార్టీ టిక్కెట్ కోసం బయట వాళ్ల నుంచి సైతం పోటీ పెరిగే పరిస్థితి వచ్చింది. దీంతో కాంగ్రెస్ టిక్కెట్ల కేటాయింపునకు సంబంధించి సునీల్ కనుగోలు, ఇతర సర్వే బృందాలతో విడతలవారీగా సర్వే చేయిస్తూ వస్తోంది. సర్వేల ఫలితాల ఆధారంగా టికెట్లు కేటాయించనున్నట్లు పీసీసీ వర్గాలు చెబుతున్నాయి.

తెలంగాణ జాగృతి నుంచి కాంగ్రెస్ వరకు..

ముత్యాల సునీల్‌రెడ్డి మొదటగా ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ జాగృతి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఈ క్రమంలో బాల్కొండ నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ వచ్చారు. తర్వాత కాలంలో 2014లో టీఆర్‌ఎస్ టిక్కెట్ ఆశించినా దక్కలేదు. దీంతో బీజేపీలో చేరారు. అక్కడా టిక్కెట్ దక్కకపోవడంతో బీజేపీని వీడారు. మళ్లీ 2018 ఎన్నికల సమయంలో సునీల్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి టిక్కెట్ ఆశించినప్పటికీ దక్కకపోవడంతో చివరి నిమిషంలో బీఎస్పీ నుంచి టిక్కెట్ తెచ్చుకుని బరిలోకి దిగారు. ఈ ఎన్నికల్లో సునీల్‌కు 42వేల ఓట్లు వచ్చాయి. అప్పటి నుంచి పార్టీలతో సంబంధం లేకుండా నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు చేస్తూ వచ్చారు. ఈ క్రమంలో బీజేపీలో చేరేందుకు సునీల్ గట్టిగానే ప్రయత్నాలు చేశారు. అయితే అది సాధ్యపడకపోవడంతో ప్రస్తుతం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఇదిలా ఉండగా బాల్కొండ టిక్కెట్ కోసం డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ ఇప్పటికే రేసులో ఉన్నారు. సునీల్ చేరిక అంశం కొన్ని నెలలుగా నడుస్తుండడంతో కాంగ్రెస్ చేసిన వివిధ విడతల సర్వేల్లోనూ ఆయన పేరును చేర్చడం గమనార్హం. మంత్రి ప్రశాంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇక్కడ బీజేపీ నుంచి ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి రేసులో ఉండగా, తాజాగా సునీల్ కాంగ్రెస్‌లో చేరడంతో నియోజకవర్గంలో రాజకీయ ముఖచిత్రం మారినట్లు వివిధ వర్గాల్లో చర్చ నడుస్తోంది. మొత్తానికి ఇక్కడ త్రిముఖ పోటీ ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

అమర్‌నాథ్‌లో యాత్రికులకు అన్నదానం

- సిద్దిపేట, నిజామాబాద్ జిల్లాల నుంచి సేవకు తరలివెళ్లిన అమర్‌నాథ్ ట్రస్ట్ సభ్యులు
- 2011 నుంచి ట్రస్ట్ ద్వారా అన్నప్రసాదం పంపిణీ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ప్రపంచంలోనే అత్యంత కష్టతరమైన తీర్థయాత్రగా చెప్పుకునే జమ్మూకశ్మీర్‌లోని అమర్‌నాథ్ యాత్రకు వెళ్తున్న భక్తులకు తెలంగాణ నుంచి సిద్దిపేటకు చెందిన అమర్‌నాథ్ అన్నదాన సేవాసమితి ట్రస్ట్ సభ్యులు అన్నదానం, సేవలు అందజేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ విడతలో నిజామాబాద్‌కు చెందిన ట్రస్ట్‌సభ్యులు మంచాల జ్ఞానేందర్‌గుప్తా, కుమ్మరికుంట రమేశ్, చింత శ్రీనివాస్‌లు బల్తల్ బేస్ క్యాంపు వద్ద లంగర్ వేసుకుని భారీ అన్నదాన కార్యక్రమం చేస్తున్నారు. 2011 సంవత్సరం నుంచి ఈ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతియేటా రెండునెలల పాటు అన్నదానం నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ సుమారు 8వేల మందికి అన్నదాన వితరణ చేస్తున్నారు. ఉదయం టీ, స్నాక్స్, టిఫిన్, మధ్యాహ్నం లంచ్, సాయంత్రం 4 గంటలకు స్నాక్స్, రాత్రి 7 గంటలకు డిన్నర్ అందజేస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా తెలంగాణ నుంచి రెండు నెలలకు సరిపడా అన్నదానానికి కావాల్సిన సరుకులు, సామగ్రిని వివిధ వాహనాల్లో తీసుకుని వెళ్లడం విశేషం. అమర్‌నాథ్ యాత్రలో తెలుగు ఆహారానికి అన్ని రాష్ట్రాల వాళ్లు అత్యంత ప్రాధాన్యం ఇస్తుండడం విశేషం.



అమర్‌నాథ్ వద్ద బల్తల్ బేస్‌క్యాంపులో అన్నదానం చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

నిజామాబాద్‌కు చెందిన ట్రస్ట్ సభ్యుడు మంచాల జ్ఞానేందర్ గుప్తా ఫోన్ ద్వారా 'సాక్షి'తో మాట్లాడారు. సిద్దిపేటలో 2011లో ఈ ట్రస్ట్ ఏర్పాటు అయిందన్నారు. ఈ ట్రస్ట్‌లో సుమారు 150 మంది సభ్యులు ఉన్నారన్నారు. కాగా ప్రతి ఏడాది బల్తల్ బేస్ క్యాంప్, పంచతరణి వెళ్లి అక్కడ అన్నదానం చేస్తున్నామన్నారు. తమకు అన్నదానం చేసే అవకాశం ఈ విడతలో వచ్చిందన్నారు. జూలై 1న అమర్‌నాథ్ ఆలయాన్ని నిర్వాహకులు తెరిచి స్వామికి హారతి ఇచ్చి భక్తులకు మంచులింగ సహిత అమర్‌నాథుడి దర్శనం కల్పిస్తారన్నారు. ఆగస్టు 31న స్వామికి హారతి ఇచ్చి దర్శనం ఆపివేస్తారన్నారు. ప్రతిరోజూ ఆలయ దర్శనానికి దాదాపు 30వేల మంది భక్తులు వస్తున్నారన్నారు. తమ ట్రస్ట్ ద్వారా ప్రతిరోజూ సుమారు 8వేల మందికి లంగర్‌లో అన్నప్రసాదం అందిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం అన్నదానానికి సుమారు రూ. 60 లక్షలు ఖర్చు అవుతున్నాయన్నారు. అమర్‌నాథ్‌లో అన్నదాన సేవాసమితి ట్రస్టు సభ్యులు 15 రోజులకు ఒక టీం చొప్పున వెళ్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విడత అన్నదాన కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు శ్రీలక్ష్మి జ్ఞానేందర్, ఎల్లంకి సుదర్శన్, రజిత, కుమ్మరికుంట రమేశ్, చింత శ్రీనివాస్, రుక్మిణి, పంకజ, మల్లికార్జున్ పాల్గొన్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

పరీక్షలు వాయిదా

తెయూ(డిచ్‌పల్లి): విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రభుత్వం విద్యాసంస్థలకు రెండు రోజుల సెలవులు ప్రకటించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో గురువారం, శుక్రవారం (20, 21వ తేదీల్లో) జరగనున్న పీజీ సెమిస్టర్‌ పరీక్షలు, యూజీ ప్రాక్టికల్స్‌, ప్రాజెక్టు వర్క్‌ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు కంట్రోలర్‌ ఎం అరుణ తెలిపారు. 22న పరీక్షలు యథావిధిగా జరుగుతుందని, వాయిదా వేసిన పరీక్షల తేదీలు త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.

ఆర్టీసీలో బదిలీలు



ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ ఆర్టీసీలో పదోన్నతులు, బదిలీలు గురువారం జరిగాయి. బోధన్‌ డిపో మేనేజర్‌ స్వామిని హైదరాబాద్‌లోని హెడ్‌ ఆఫీస్‌కు బదిలీ చేయగా ఆయన స్థానంలో నిజామాబాద్‌–2 డిపోలోని అసిస్టెంట్‌ మేనేజర్‌ (మెకానిక్‌) శ్రీనివాస్‌ పదోన్నతిపై బోధన్‌ డిపో మేనేజర్‌గా వెళ్లారు. ఆర్మూర్‌ డిపో మేనేజర్‌ కవితను హైదరాబాద్‌లోని చెంగిచెర్ల డిపో మేనేజర్‌గా బదిలీ చేయగా ఆమె స్థానంలో పెద్దపల్లి జిల్లాలోని మంథని డిపోలో అసిస్టెంట్‌ మేనేజర్‌గా ఉన్న శ్రీనివాస్‌ పదోన్నతిపై ఆర్మూర్‌ డిపో మేనేజర్‌గా నియమితులయ్యారు.

పంటల నమోదు పరిశీలన



ఇందల్వాయి: మండలంలోని వెంగల్పాడులో ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్‌ హుస్సేన్‌ గురువారం పర్యటించారు. ఏఈవోలు చేపట్టిన పంట నమోదు వివరాలను తెలుసుకున్నారు. సర్వే నంబర్ల ప్రకారం రైతులు సాగు చేసిన పంటల వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్‌ కుమార్‌, ఏఈవోలు శ్రీహరి, ప్రకాష్‌గౌడ్‌, సతీష్‌ ఉన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం వాయిదా

నిజామాబాద్‌ అర్బన్‌: జిల్లా స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో టీఎన్‌జీవో భవన్‌లో శుక్రవారం జరగాల్సిన వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం వాయిదా వేసినట్లు డీఈవో దుర్గాప్రసాద్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్న కారణంగా ప్రభుత్వం సెలవు ప్రకటించడంతో వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. మళ్లీ సమావేశాన్ని ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామన్నారు.

అడిషనల్‌ డీసీపీ మధుసూదన్‌రావు బదిలీ

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ స్పెషల్‌ బ్రాంచ్‌ ఏసీపీగా పని చేసిన మధుసూధన్‌రావుకు అడిషనల్‌ డీసీపీగా పదోన్నతి రావడంతో హైదరాబాద్‌లోని నార్త్‌ జోన్‌కు బదిలీ అయ్యారు. డీసీపీలు బదిలీపై వెళ్లడంతో పోలీసుశాఖలో సీనియర్‌ అధికారి కావడంతో ఆయన జిల్లాలో ఇన్‌చార్జి అడిషనల్‌ డీసీపీ(అడ్మిన్‌)గా పనిచేశారు.

బెస్ట్‌ అవైలబుల్‌ స్కీంలో ప్రవేశాలకు లక్కీ డ్రా



సుభాష్‌నగర్‌: జిల్లా షెడ్యూల్డ్‌ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బెస్ట్‌ అవైలబుల్‌ స్కూల్స్‌ స్కీం కింద ఆయా పాఠశాలల్లో ప్రవేశాల కోసం గురువారం లక్కీ డ్రా ప్రక్రియ నిర్వహించారు. కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో అదనపు కలెక్టర్‌ యాదిరెడ్డి పర్యవేక్షణలో, విద్యార్థులు వారి తల్లిదండ్రుల సమక్షంలో డ్రా కొనసాగింది. ఒకటో తరగతిలో ప్రవేశాలు కోరుతూ 433 మంది దరఖాస్తు చేసుకోగా, డ్రా ద్వారా 102 మందికి ప్రవేశాలు కల్పించారు. అదేవిధంగా ఐదో తరగతిలో ప్రవేశం కోరుతూ మొత్తం 511 మంది దరఖాస్తులు చేసుకోగా, డ్రా విధానం ద్వారా 101 మందికి ప్రవేశాలు కల్పించినట్లు జిల్లా షెడ్యూల్డ్‌ కులాల అభివృద్ధి శాఖ అధికారిణి శశికళ తెలిపారు.

డుమ్మా చాన్స్‌ లేదిక..!

- టీచర్ల సెలవుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు
- కాంప్లెక్స్‌ హెచ్‌ఎంలకు బాధ్యతలు



నిజామాబాద్‌ అర్బన్‌ : ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. చాలామంది ఉపాధ్యాయులు సెలవుల కోసం దరఖాస్తు చేయకుండానే రోజులు, వారాలు, నెలలు డుమ్మా కొడుతున్నారు. అనధికార హాజరుపై అనేక ఫిర్యాదులు రావడంతో ప్రత్యేక నిఘా పెట్టాలని విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. విధులకు డుమ్మ కొడుతున్న వారి పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్జేడీలకు, డీఈవోలకు విద్యాశాఖ సంచాలకురాలు దేవసేన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా అటెండెన్స్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేసే చేసే బాధ్యతను కాంప్లెక్స్‌ హెచ్‌ఎంలకు అప్పగించారు.

ఉపాధ్యాయుల హాజరుపై నిఘా..

జిల్లాలో 1,705 ప్రభుత్వ బడులున్నాయి. ఇందులో 2,68,368 మంది విద్యార్థులున్నాయి. 4,982 మంది టీచర్లు ఉన్నారు. చాలామంది ఉపాధ్యాయులు బడులకు వెళ్లకుండా డుమ్మా కొడుతున్నట్లు జిల్లాలో పర్యటించిన విద్యాశాఖ ఉన్నతాధికారుల పరిశీలనలో తేలింది. అలాగే అనుమతిపై విదేశాలకు వెళ్లిన వారు గడువు ముగిసినా విధుల్లో చేరకుండా నిర్లక్ష్యం చేస్తున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఇలాంటి వారి విషయంలో హెచ్‌ఎంల నుంచి ఉన్నతాధికారులకు ఎలాంటి సమాచారం అందడం లేదని తెలుసుకున్న అధికారులు ఆన్‌లైన్‌ హాజరుపై ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధ్యాయులు బడికి హాజరు కాకపోవడం వల్ల విద్యార్థులకు ఎంతో నష్టం జరుగుతుందని, అందువల్ల ప్రతి టీచర్‌ హాజరుపై నిఘాపెట్టాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో వివిధ ఉపాధ్యాయ సంఘాలకు చెందిన కొంతమంది నాయకులు స్కూళ్లకు వెళ్లకుండా డుమ్మాలు కొడుతున్నారు. ఇలాంటి వారికి తాజా ఉత్తర్వులు చెంపపెట్టుకానున్నాయి.

బాధ్యతల అప్పగింత..

ఉపాధ్యాయుల సెలవు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసే బాధ్యతలను కాంప్లెక్స్‌ ప్రాథమిక ఉపాధ్యాయులకు అప్పగించారు. జిల్లాలో ప్రస్తుతం 80 కాంప్లెక్స్‌ పాఠశాలలు ఉన్నాయి. కాంప్లెక్స్‌ పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సెలవు వివరాలను ఆయా పాఠశాల హెచ్‌ఎంల నుంచి తీసుకొని ప్రతినెలా 5వ తేదీలోగా కాంప్లెక్స్‌ హెచ్‌ఎంలు ఆన్‌లైన్‌ చేయనున్నారు. సెలవుల రిజిస్టర్‌ సముదాయ పాఠశాల హెచ్‌ఎం ఆన్‌లైన్‌లో నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి టీచర్‌ ఏ నెలలో ఎన్ని సీఎల్‌, ఓసీఎల్‌ను వినియోగించుకున్నారనే వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదయ్యేలా చర్యలు తీసుకోనున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో ఉపాధ్యాయుల అనధికారిక గైర్హాజర్‌కు బ్రేక్‌ పడనుంది. అనుమతి లేకుండా విధులకు డుమ్మా కొడితే సీసీఏ నిబంధనల ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నారు.

లొకేషన్‌ మార్చేసి..

ఇది వరకే జిల్లా విద్యాశాఖలో జియో అటెండెన్స్‌ వినియోగంలో ఉంది. మొదట్లో పకడ్బందీగానే అమలు చేశారు. ప్రస్తుతం దీనిపై పర్యవేక్షణ కరువైంది. దీంతో కొందరు టీచర్లు, ముఖ్యంగా యూనియన్‌ నాయకులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. వివిధ సాంకేతిక కారణాలు చూపి పూర్తిస్థాయి అటెండెన్స్‌ పొందుతున్నారు. నెలల తరబడి పాఠశాలలకు వెళ్లడం లేదు. మరికొందరు టీచర్లు లొకేషన్‌ మార్పు చేసుకుని పాఠశాలలో లేకున్నా ఉన్నట్లు మార్పు చేసి ఫొటోలు అప్‌లోడ్‌ చేస్తున్నారు. కాని ప్రస్తుతం ఆన్‌లైన్‌ అటెండెన్స్‌ విధానం సక్రమంగా అమలవుతుందా అనే అనుమానం కలుగుతోంది. సంబంధిత హెచ్‌ఎం కొందరు యునియన్‌ నాయకులకు వత్తాసు పలకడంతో ప్రధాన లక్ష్యాలు నీరుగారుపోతున్నాయి.

పకడ్బందీగా అమలు చేస్తాం

టీచర్లు ఆన్‌లైన్‌లో అటెండెన్స్‌ నమోదు పకడ్బందీగా అమలు చే స్తాం. అనధికారిక సెలవులు తగ్గిస్తాం. ప్రతి టీచర్‌ నిబంధనల మే రకే ఉండాలి. పాఠశాలకు రాకున్నా హాజరు పొందితే చర్యలు తప్పవు. నూతన నిబంధనలు పక్కాగా అమలు చేస్తాం.

– దుర్గాప్రసాద్‌, డీఈవో

నేను తప్పు చేయలేదని చెప్పండి

ఉపాధ్యాయులపై ఓ హెచ్‌ఎం ఒత్తిడి

నిజామాబాద్‌ అర్బన్‌: తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తమని చెప్పాలని ఓ హెచ్‌ఎం తన బడిలోని ఉపాధ్యాయులపై ఒత్తిడి చేస్తున్నారు. తనపై చర్యలు తీసుకోకుకుండా అడ్డుకోవాలని వారిని డీఈవో కార్యాలయం చుట్టు తిప్పుతున్నారు. ఇందల్వాయి మండలంలోని ఓ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంపై వచ్చిన ఫిర్యాదులపై ఇటీవల విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టారు. విచారణలో సదరు హెచ్‌ఎం నిబంధనలకు విరుద్ధంగా ఉపాధ్యాయులకు వేతనాలు మంజూరు చేసినట్లు తేలింది. అతడిపై చర్యలు తీసుకోవడానికి జిల్లా అధికారులు సిద్ధమయ్యారు. దీంతో ఆయన కొన్ని రోజులుగా జిల్లా విద్యాశాఖ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నాడు. తన పాఠశాలకు చెందిన పది మంది టీచర్లను వెంటబెట్టుకొని తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని, తనకు సహకరించాలంటూ ఉపాధ్యాయులపై ఒత్తిడి తీసుకు వస్తున్నాడు. బడి వదిలేసి అందరు టీచర్లను తన వెంట తిప్పుకోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మహిళ టీచర్లకు సైతం ఫోన్లు చేస్తూ తాను చెప్పిన చోటుకు రావాలంటూ హుకుం జారీ చేస్తున్నాడు. దీంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై డీఈవోకు ఫిర్యాదు చేసేందుకు ఉపాధ్యాయులు సిద్ధమవుతున్నారు. సదరు హెచ్‌ఎం గతంలో మరో ప్రాంతంలో పని చేసినప్పుడు కూడా మహిళా ఉపాధ్యాయులను పట్ల ఇబ్బందికరంగా ప్రవర్తించాడని ఆరోపణలు ఉన్నాయి. అంతేగాక జిల్లా విద్యాశాఖ, మండల విద్యాశాఖ అధికారులు చేపట్టే సమావేశాలకు గైర్హాజరు అవడం, వారి ఆదేశాలను పాటించకపోవడం అనే ఆరోపణలు ఉన్నాయి. హెచ్‌ఎం వేధింపులపై ఉపాధ్యాయులు ఓ ప్రధాన ఉపాధ్యాయ సంఘం నాయకులు ఫిర్యాదు చేశారు.

మంజూరైన పనులు పూర్తి చేయాలి

- జెడ్పీ చైర్మన్‌ విఠల్‌రావు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్‌ విఠల్‌రావు

నిజామాబాద్‌నాగారం: జిల్లాకు 15వ ఆర్థిక సంఘం ద్వారా మంజూరైన పనులను త్వరగా పూర్తి చేయాలని జెడ్పీ చైర్మన్‌ విఠల్‌రావు ఆదేశించారు. గురువారం జిల్లా పరిషత్‌లో స్థాయి సంఘ సమావేశం సాంఘిక సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్‌ దాసరి ఇందిరా లక్ష్మీనర్సయ్య అధ్యక్షతన జరిగింది. జెడ్పీ చైర్మన్‌ మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక సంఘం, 15వ ఆర్థిక సంఘం ద్వారా 2020–21 నుంచి 2022–23 వరకు మంజూరైన పనులు త్వరగా పూర్తి చేయించాలని పంచాయతీ రాజ్‌, ఆర్‌అండ్‌బీ అధికారులకు ఆదేశించారు. భారీ వర్షాలు కురుస్తున్నందునా అప్రమత్తంగా ఉండాలన్నారు. వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించుటకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మంజూరు రుణాలు అన్ని గ్రౌండ్‌ అయ్యే విధంగా చూడాలని అధికారులకు ఆదేశించారు. జెడ్పీ సీఈవో గోవింద్‌, జెడ్పీటీసీలు అంబర్‌ సింగ్‌, మ్యాక విజయ, భాస్కర్‌ రెడ్డి, తనూజ, పంచాయతీ రాజ్‌ ఎస్‌ఈ ప్రభాకర్‌, ఈఈలు బావన్న, శంకర్‌, ఆర్‌డబ్ల్యూఎస్‌ ఈఈ రాకేష్‌ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థుల పీజీ ఫలితాలు విడుదల

నిజామాబాద్‌ సిటీ: నిజామాబాద్‌ మెడికల్‌ కళాశాల ఎండీ, ఎంఎస్‌ పరీక్షల ఫలితాలు గురువారం విడుదల అయ్యాయి. ఈ సంవత్సరం మొత్తం 48 మంది ఎండీ, ఎంఎస్‌ పరీక్షలు రాయగా 47 మంది పాస్‌ కాగా, ఒకరు ఫెయిల్‌ అయినట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ ఇందిరా తెలిపారు.

క్రైం కార్నర్‌

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

బాల్కొండ: ముప్కాల్‌ మండలం కొత్తపల్లి ఊర చెరువులో పడి నల్లల గంగాధర్‌(52) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై భాస్కరాచారీ తెలిపిన వివరాలు.. గంగాధర్‌ కొత్తపల్లిలో వాటర్‌మన్‌గా పనిచేస్తు జీవనం సాగించేవాడు. కొంత కాలం క్రితం ఊరు వదిలి వెళ్లాడు. మూడు రోజుల క్రితం మళ్లీ వచ్చాడు. కొందరికి అప్పులు చెల్లించాల్సి ఉండటంతో అప్పులు చెల్లించలేక, వారికి మొఖం చూపలేక మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

రైలు కింద పడి ఒకరు..

కామారెడ్డి క్రైం: రైలు కింద పడి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి – ఉప్పల్‌వాయి రైల్వే స్టేషన్‌ల మధ్య బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పట్టాలపై మృతదేహం ఉన్నట్లు స్థానికులు సమాచారం ఇవ్వడంతో రైల్వే పోలీసులు గురువారం ఉదయం పరిశీలించి విచారణ జరిపారు. మృతుని వయస్సు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉంటుందని ఎస్సై తావ్రూ నాయక్‌ తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రి పోస్టుమార్టం గదికి తరలించామన్నారు.

మూడు ఆలయాల్లో చోరీ

నవీపేట: మండలంలోని మూడు గ్రామాల్లోని ఆలయాల్లో గురువారం తెల్లవారుజామున చోరీ జరిగింది. బినోలలోని నల్ల పోచమ్మ ఆలయం, గాంధీనగర్‌లోని రామాలయం, హనుమాన్‌ ఫారమ్‌లోని హనుమాన్‌ ఆలయాల్లో దొంగలు చోరీ చేశారు. దేవతల విగ్రహాలపై ఉన్న వెండి ఆభరణాలతో పాటు హుండీలు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

బర్కత్‌పురా కాలనీలో బైక్‌..

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌లోని బర్కత్‌పుర కాలనీలో ఓ హోటల్‌ వద్ద పార్కింగ్‌ చేసిన బైక్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుడు మహ్మద్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై అశోక్‌ తెలిపారు.

నంబర్‌ ప్లేట్లు లేని బైక్‌లు స్వాధీనం

ఖలీల్‌వాడి: నగరంలోని రెండో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని పెద్దబజార్‌ వద్ద గురువారం డ్రంకన్‌ డ్రైవ్‌ తనిఖీలు చేసినట్లు ఎస్సై అశోక్‌ తెలిపారు. నంబర్‌ ప్లేట్లు లేని మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

సిర్నాపల్లిలో వివాహిత అదృశ్యం

ఇందల్వాయి: ఇందల్వాయి మండలం సిర్నాపల్లికి చెందిన జంగం శిరీష(25) గురువారం నుంచి కనపడటం లేదని ఆమె అత్త మణియమ్మ ఫిర్యాదు చేసినట్లు ఎస్సై మహేశ్‌ తెలిపారు. మణియమ్మ చిన్న కుమారుడు రంజిత్‌కు సదాశివనగర్‌ మండలం ధగ్గి గ్రామానికి చెందిన శిరీషతో ఏడేళ్ల క్రితం వివహం జరిగింది. వారికి ఒక కొడుకు, కూతురు ఉన్నారు. జీవనోపాధి కోసం రంజిత్‌ గల్ఫ్‌ వెళ్లాడు. బుధవారం రాత్రి నుంచి శిరీష కనిపించడం లేదు. పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె అత్త పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఇరిగేషన్‌ కార్యాలయంలో ఫ్లడ్‌ కంట్రోల్‌రూం ఏర్పాటు

సుభాష్‌నగర్‌: జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకొని జిల్లా కేంద్రంలోని నీటిపారుదల శాఖ ప్రధాన కార్యాలయంలో ఫ్లడ్‌ కంట్రోల్‌రూం ఏర్పాటు చేశామని ఇరిగేషన్‌ చీఫ్‌ ఇంజినీర్‌ మధుసూదన్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. వర్షాలతో ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్‌ రూం 08462–221403 నంబర్‌కు ఫోన్‌ చేసి సమాచారం అందించాలని సూచించారు.

మెప్మా పీడీ బదిలీ

నిజామాబాద్‌నాగారం : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పీడీ సత్యనారాయణ బదిలీ అయ్యారు. డిప్యుటేషన్‌లో వచ్చి మెప్మా పీడీగా నాలుగేళ్ల 10 నెలల పాటు విధులు నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా బదిలీ అయ్యారు. ఆయనకు పదోన్నతి రావడంతో మదర్‌ డిపార్టుమెంట్‌ హైదరాబాద్‌లోని సమాచారశాఖలో ప్రాంతీయ ఇంజినీర్‌గా వెళ్లారు. గురువారం విధుల నుంచి రిలీవ్‌ కావడంతో ఉద్యోగులు సత్కరించారు.

ఇన్‌చార్జి పీడీగా మాధురి లత

మెప్మా ఇన్‌చార్జి పీడీగా మాధురి లతకు బాధ్యతలు ఇచ్చారు. ప్రస్తుతం ఆమె డిస్ట్రిక్ట్‌ మిషన్‌ కోఆర్డినేటర్‌ ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నారు. కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశాల మేరకు ఇన్‌చార్జి బాధ్యతలు మాధురిలతకు అప్పగించారు. శుక్రవారం ఆమె బాధ్యతలు తీసుకోనున్నారు.

ఆర్మూర్‌ ఏసీపీగా జగదీశ్‌చంద్‌

ఖలీల్‌వాడి: ఆర్మూర్‌ ఏసీపీగా జగదీశ్‌చంద్‌ నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం రాచకొండ కమిషనరేట్‌లో సీసీఆర్‌బీలో ఏసీపీగా పని చేస్తున్నారు. ఇక్కడ ఉన్న ఏసీపీ ప్రభాకర్‌ అడిషనల్‌ ఎస్పీగా పదోన్నతి పొందారు. నిజామాబాద్‌ సీసీఆర్‌బీలో ఏసీపీ బీలో వర్టికల్‌ ఫంక్షన్‌ ఏసీపీగా ఉన్న చంద్‌ పాషా హైదరాబాద్‌లోని సీసీఆర్‌బీకి బదిలీ అయ్యారు.

దర్యాప్తు వేగవంతం



సీసీ ఫుటేజీ పరిశీలిస్తున్న ఏసీపీ

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌లోని జిరాయత్‌నగర్‌లో బుధవారం జరిగిన జంట హత్యల కేసులో పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. గురువారం జిల్లా కేంద్రం నుంచి ఏసీపీ ప్రభాకర్‌ సమక్షంలో సీసీఎస్‌ బృందం ఘటన స్థలాన్ని పరిశీలించారు. నిందితుడు ఇంట్లోకి వచ్చి వెళ్లిన దృశ్యాలను సీసీ ఫుటేజీలో పరిశీలించారు. ఏసీపీ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ నిందితుడి కోసం గాలిస్తున్నామని చెప్పారు. త్వరలోనే పట్టుకుంటామన్నారు. సీసీఎస్‌ సీఐలు రమేష్‌, గోపినాథ్‌, భరత్‌ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నవీపేట: మండలంలోని నాగేపూర్‌ సమీపంలోని బాసర రహదారి మూలమలుపు వద్ద గురువారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో కోస్లీ గ్రామానికి చెందిన అడెల్లి సాయిలు(40) మృతి చెందాడు. నవీపేట నుంచి కోస్లీ బైక్‌పై వెళ్తుండగా మూలమలుపు దగ్గర డివైడర్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య చందన, కుమారుడు, కూతురు ఉన్నారు.

చెరువులో తేలిన మృతదేహం

బిచ్కుంద: బిచ్కుందలోని వడ్డెర కాలనీలో నివసిస్తున్న పల్లపు రాములు మృతదేహం గురువారం సొదర్‌ చెరువులో తేలిందని ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 17న ఇంట్లో నుంచి వెళ్లిన రాములు తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం చెరువులో మృతదేహం తేలడంతో రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. గత కొన్ని ఏళ్ల నుంచి భార్య, పిల్లలు రాములును వదిలేసి దూరంగా ఉంటున్నారు. చిన్నమ్మ దగ్గర రాములు ఉంటున్నాడు. భార్య పిల్లలు దూరంగా ఉన్నారని మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుని చెల్లెలు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశామని ఎస్సై తెలిపారు.

మరింత అప్రమత్తత అవసరం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్‌

సుభాష్‌నగర్‌ : జిల్లావ్యాప్తంగా భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు మరింత అప్రమత్తతతో కూడిన చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌ హాల్‌లో నీటిపారుదల, వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్‌, పశుసంవర్ధక, ఉద్యానవన తదితర శాఖల అధికారులతో కలెక్టర్‌ సమీక్ష నిర్వహించారు. ఎడతెరపి లేని వర్షాలతో చెరువులెన్ని నిండాయి..? వాగుల కాల్వల వివరాలు తెలుసుకున్నారు. శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌కు ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం, రిజర్వాయర్‌ నీటిమట్టం గురించి ఆరా తీశారు. వర్షాలతో పంట నష్టం వివరాలు తెలుసుకున్నారు. జిల్లాలో వర్షాల కారణంగా ఎలాంటి ప్రాణనష్టం, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని ఈ సందర్భంగా కలెక్టర్‌ తెలిపారు. చెరువులకు గండ్లు పడకుండా నీటి నిల్వలు పరిశీలిస్తూ ఉండాలన్నారు. శ్రీరాంసాగర్‌లోకి చేపలవేటకు వెళ్లకుండా చూడాలన్నారు.

స్తంభాలను తాకవద్దు..

విద్యుత్‌ ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. ప్రజలెవరు కూడా విద్యుత్‌ వైర్లు, స్తంభాలను తాకొద్దని హితవు పలికారు. ఎలాంటి ప్రమాదమైన కలెక్టరేట్‌ కంట్రోల్‌ రూం నెంబర్‌ 08462 – 220183కు సమాచారం అందించాలన్నారు. అదనపు కలెక్టర్‌ చిత్రామిశ్రా, నీటి పారుదల శాఖ ఎస్‌ఈలు బద్రీనారాయణ, శ్రీనివాస్‌, డీఈ ప్రవీణ్‌, సీపీవో బాబురావు, డీఏవో వాజిద్‌ హుస్సేన్‌, డీపీఓ జయసుధ, పశు సంవర్ధక శాఖ జేడీ జగన్నాథచారి, పీఆర్‌ ఈఈలు బావన్నా, శంకర్‌ పాల్గొన్నారు.

నిజాంసాగర్‌లోకి భారీ వరద



నిజాంసాగర్‌ ప్రాజెక్టులో నీటిమట్టం

నిజాంసాగర్‌: ఎగువ ప్రాంతాల్లోని మెదక్‌, సంగారెడ్డి జిల్లాల్లో కుండపోతగా కురుస్తున్న వర్షాలకు గురువారం మంజీర నదికి వరద పోటెత్తింది. మెదక్‌ జిల్లాలోని ఘనపురం ఆనకట్ట అలుగు దూకుతోంది. హల్దీవాగు కూడా పొంగిపొర్లుతోంది. ఘనపురం ఆనకట్ట ద్వారా 20 వేల క్యూసెక్కులు, హల్దీ వాగు ద్వారా 10 వేల క్యూసెక్కుల నీరు మంజీర నదిలోకి వస్తోంది. దీంతో నిజాంసాగర్‌ ప్రాజెక్టులోకి భారీ ఇన్‌ఫ్లో వస్తోంది. గురువారం రాత్రి నిజాంసాగర్‌ ప్రాజెక్టులోకి 27,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. నిజాంసాగర్‌ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా.. గురువారం రాత్రి వరకు 1,391.61 అడుగుల (4.779టీఎంసీలు) మేర నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు.

ఎన్నికలపై అవగాహనకు ప్రచార రథాలు

- లాంఛనంగా ప్రారంభించిన కలెక్టర్‌



జెండా ఊపి రథాలను ప్రారంభిస్తున్న కలెక్టర్‌

సుభాష్‌నగర్‌: ఎన్నికల్లో పాల్గొనాల్సిన ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వీలుగా ఏర్పాటు చేసిన సంచార ప్రచార రథాలను కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు గురువారం కలెక్టరేట్‌ ఆవరణలో జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గం పరిధిలో రెండు చొప్పున ప్రచార వాహనాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించేలా ఏర్పాట్లు చేశామని కలెక్టర్‌ తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల ప్రక్రియ ఎంతో కీలకమైందని, ఓటర్లు తప్పనిసరిగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఈ దిశగా ఓటర్లను చైతన్యపరుస్తూ ఈవీఎం, వీవీ ప్యాట్‌ల గురించి అవగాహన కల్పించేందుకు ప్రచార రథాలు గ్రామగ్రామాన సంచరిస్తాయన్నారు. కార్యక్రమంలో డీసీవో సింహాచలం, కలెక్టరేట్‌ ఏవో ప్రశాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



సుభాష్‌నగర్‌: మొక్కలు నాటి సంరక్షించాలని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌ ఆవరణలో గురువారం ఆయన మొక్కలు నాటారు. కార్యాలయం ఆవరణలో అటవీ శాఖ అధికారులతో కలిసి ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. పచ్చదనం పెంపొందించడంలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తెలంగాణకు హరితహారం నిర్వహిస్తోందని కలెక్టర్‌ పేర్కొన్నారు. ఆయా శాఖలకు కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. కలెక్టరేట్‌ ఏవో ప్రశాంత్‌, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన కమాండెంట్‌ రాంప్రకాశ్‌



డిచ్‌పల్లి: డిచ్‌పల్లిలోని ఏడో బెటాలియన్‌ కమాండెంట్‌గా బి రాంప్రకాశ్‌ గురువారం బాధ్యతలు స్వీకరించారు. బెటాలియన్‌ అధికారులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సిబ్బంది నుంచి గౌరవవందనం స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత బెటాలియన్‌ ఆవరణలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో కమాండెంట్‌ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్‌ కమాండెంట్స్‌ ఎస్‌ విష్ణుమూర్తి, సీ ఆంజనేయరెడ్డి, కే భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ కేసులో నిందితుడి అరెస్టు



మాట్లాడుతున్న ఏసీపీ కిరణ్‌కుమార్‌

ఖలీల్‌వాడి: ఇద్దరిని కత్తితో బెదిరించి నగదు, బంగారం దోపిడీ చేసిన నిందితుడిని అరెస్టు చేసినట్లు ఏసీపీ కిరణ్‌కుమార్‌ తెలిపారు. గురువారం నిజామాబాద్‌లోని తన కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. వివరాలు.. నందిపేట మండలం వన్నెల్‌ గ్రామానికి చెందిన గండ్ల సాయి కుమార్‌ తన పరిచయస్తురాలు ఉమమహేశ్వరితో కలిసి ఈ నెల 13న మాక్లూర్‌ మండలం దాస్‌నగర్‌ వద్ద నిజాంసాగర్‌ కాలువపై బిర్యాని తిన్నాడు. మాక్లూర్‌ మండలం కల్లెడ గ్రామానికి చెందిన కొమిరి రాజు వారిని కత్తితో బెదిరించి రూ.10 వేల నగదు, 6 గ్రాముల బంగారు మాటిలు ఎత్తుకెళ్లాడు. దీంతో బాధితులు మాక్లూర్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నెల 19న దాస్‌నగర్‌ క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసి పారిపోతున్న రాజును పట్టుకొని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి బంగారు మాటిలు, బైక్‌, కత్తి స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరు పర్చినట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో నార్త్‌సీఐ సతీశ్‌కుమార్‌, ఎస్సై యాదగిరి గౌడ్‌, కానిస్టేబుళ్లు చందు, శ్రీను, బాల లింగం, రాజు, హోం గార్డ్‌ వెంకటస్వామి పాల్గొన్నారు.

ఎయిర్‌ గన్‌తో బెదిరించి చోరీలు

- ఇద్దరు ప్రధాన నిందితుల అరెస్ట్‌
- భారీగా బంగారం, రూ.50 వేల నగదు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బంగారం, నగదు, గన్‌



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్‌

ఖలీల్‌వాడి: ఎయిర్‌ గన్‌తో బెదిరించి దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఏసీపీ కిరణ్‌కుమార్‌ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నగరంలోని నాగారం దొడ్డి కొమురయ్య కాలనీకి చెందిన షేక్‌ సాదక్‌, హోంశెట్టి రాజేష్‌ అలియాస్‌ రాజు మూడు నెలలుగా నగరంలోని పలు చోట్ల చోరీలు చేశారు. ఖిల్లా రోడ్డులోని మొగలుపూర్‌ కాలనీలో జూన్‌ 26న హింగోరా మహమ్మద్‌ ఉస్మాన్‌ ఇంట్లోకి చొరబడి 14 తులాల బంగారం, 3 సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లారు. ఈ కేసులో నిందితులు హోంశెట్టి రవి, సాయినాథ్‌, ఓ బాల నేరస్తుడిని ఈ నెల 8న అరెస్టు చేశారు. వారి నుంచి 17 గ్రాముల బంగారం, ఆటో, రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితులు సాదక్‌, రాజేశ్‌ను గురువారం ఎస్సై సాయినాథ్‌ అరెస్టు చేశారు. వారిపై ఇప్పటికే పలు కేసులు ఉన్నాయని ఏసీపీ తెలిపారు. షేక్‌ సాదక్‌ వద్ద ఎయిర్‌గన్‌, 25 గుళ్లు, రూ.20 వేల నగదు, 10.48 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నారు. రాజేష్‌ వద్ద 0.41 తులాల బంగారం, రూ.30 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. మిగతా నిందితులు రంజని, బొంబయ్యను త్వరలోనే పట్టుకుంటామన్నారు.